TGTEL/25/A1132

మానవాళికి
# జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

మేడ్చల్ | బుధవారం | 22.07.2026 | సంపుటి : 2 | సంచిక : 20 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు

ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ ఆందోళన

### విద్యార్థులపై దమనకాండకు బాధ్యత వహించాలి..

### మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్

### విపక్ష నేతలను బలవంతంగా అరెస్టు చేసిన పోలీసులు

### రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్

### మోదీ ఇంటిని ముట్టడించిన విపక్షాలు



న్యూఢిల్లీ, జులై 21 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియా గాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను

మిగతా 2 లో



## 'మక్తల్' ఎత్తిపోతల పనుల్లో వేగం పెంచండి

### హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణాల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

### పనులు మందకొడిగా సాగడంపై తీవ్ర అసంతృప్తి

### వచ్చే ఏడాది తరగతులు ఎలా ప్రారంభిస్తారంటూ అధికారులకు మందలింపు

### పనిచేయని వారిని ఇంటికి పంపాలని ఆదేశాలు

**ఉమ్మడి పాలమూరు జిల్లాలో చేపట్టిన మక్తల్ - నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామంలోని ఎడ్యుకేషన్ హబ్‌లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు.**

వికారాబాద్, జులై 21 : కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ఆధ్వర్యంలో చేపట్టిన పనుల తీరుతెన్నులపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించి సెప్టెంబర్‌లోపు భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో నిర్లక్ష్యం వహించినా, తప్పుడు సమాచారం ఇచ్చినా సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. 2027 డిసెంబర్‌లోపు ఎంత మేరకు పనులు పూర్తి చేస్తారో రాతపూర్వకంగా నివేదిక ఇవ్వాలని చెప్పారు. మూడు నియోజకవర్గాలకు ప్రాణాధారమైన పథకంపై అలసత్వం

-మిగతా 2లో..



### దేశ యువత కోసం రాహుల్ గాంధీ పోరాటం

ఎక్స్‌వేదికగా సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్

03



03

### ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత

## పిల్లలను రెచ్చగొట్టదు

### నిందితులపై కఠిన చర్యలు

### నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జులై 21 : నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ ఘోర పాపమని, ఇలాంటివి మళ్లీ జరగకూడదని వ్యాఖ్యానించారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని, ఇలాంటి లీక్‌లను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. 'మంగళ్ మిలన్' పేరిట మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ మేరకు ప్రధాని మాట్లాడారు. ఆయన మాట్లాడిన

-మిగతా 2 లో..



02

### ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

### సాగు,తాగునీటి సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, జులై 21 : ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన

-మిగతా 2 లో..

## కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

### నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా?

### దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం

### రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

### మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్, జులై 21 : కాళేశ్వరం దగ్గర చిల్లర రాజకీయం చేయడంపై సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని

-మిగతా 2 లో..

## దేవాదుల పంపులు 24 గంటలు పనిచేస్తాయి

### 9 పంపింగ్ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో ప్రారంభం

### కాళేశ్వరం కాంట్రాక్టర్ల నుంచి బీఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు

### కవిత ఆరోపణలకు హరీశ్ రావు సమాధానం చెప్పాలి

### రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, జూలై 21 : దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఈ రాత్రి నుంచే 9 పంపింగ్ యూనిట్లు 24 గంటల పాటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన చిట్-చాట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన

-మిగతా 2 లో..



## రైతులు చనిపోయినా బాధ్యత లేదా?

### వారికి కనీసం రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా

### కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

### పార్టీ తరపున ఒక్కో కుటుంబానికి 5 లక్షల సాయం

ఆదిలాబాద్, జూలై 21 : ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేడు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేడు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 259 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹98

## హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

### గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని సెక్యూరిటీ సూచన

### రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు ఆగ్రహం

03



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది. వీఐపీలు ప్రవేశించే గేట్ నంబర్ 6 నుంచి కాకుండా, సామాన్య ప్రజలు ప్రవేశించే గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని రంగనాథ్‌కు సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో గేట్ నంబర్ 4 వద్ద సామాన్య ప్రజలు వాహనాలు పార్క్ చేసే స్థలంలో కారు పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లారు.



### జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

02

### ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు



## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

### అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

### ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి

హైదరాబాద్, జూలై 21 : బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్

-మిగతా 2 లో..

# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇవాపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోదీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్ కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ



బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్‌ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

## పిల్లలను రెచ్చగొట్టొద్దు

(మొదటిపేజీ తరువాయి)



అంశాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలి. రాజకీయంగాను విభేదాలు ఉండొచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపైనా ఉందని ప్రధాని సూచించారు. 'పిల్లలను రెచ్చగొట్టొద్దు. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభం. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టం. వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత' అని పేర్కొన్నారు. దేశంలో ప్రధాన పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్ మేలో నిర్వహించగా.. పేపర్ లీక్ ఆరోపణలతో జూన్‌లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. సీబీఎస్‌ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్‌ఎం) విధానంలోనూ లోపాలు వెలుగుచూశాయి. అలాగే మరికొన్ని లీకేజీ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'చలో పార్లమెంటు' తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఢిల్లీ రణరంగాన్ని తలపించింది. ఈ నేపథ్యంలోనే మోదీ స్పందన వచ్చింది.



## రైతులు చనిపోయినా బాధ్యత లేదా?

(మొదటిపేజీ తరువాయి)

మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్‌ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చేరకున్న కేటీఆర్ లక్షెట్టిపేట సమీపంలోని అంకతిపల్లిలోని వాసవీ ఫంక్షన్‌హాలుకు చేరుకుని రైతు సదస్సులో పాల్గొన్నారు.

## ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

(మొదటిపేజీ తరువాయి)

సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలంలోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

## దేవాదుల పంపులు 24 గంటలు పనిచేస్తాయి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ ఇటీవల దేవాదుల ప్రాజెక్టుపై మంత్రుల బృందం నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. గోదావరి నుంచి వీలైనంత ఎక్కువ నీటిని ఎత్తిపోసి, దేవాదుల పరిధిలోని 9 జిల్లాలకు చెందిన 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు పంపులను గరిష్ట సామర్థ్యంతో నడపాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయ విమర్శలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేత హరీశ్ రావుపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. దేవాదుల ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేయడం మానేసి, కాళేశ్వరం ప్రాజెక్టులో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో మొదట రూపొందించిన షీట్ పైల్ ఫౌండేషన్ డిజైన్‌ను ఎందుకు మార్చి సెకెంట్ పైల్ ఫౌండేషన్ అమలు చేశారో హరీశ్ రావు వివరించాలని మంత్రి ప్రశ్నించారు. ఆ నిర్ణయం వల్లే ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి చేరుకుందని అన్నారు. అలాగే, కాళేశ్వరం కాంట్రాక్టర్లు బీఆర్‌ఎస్‌కు రూ. 1,400 కోట్లు చెల్లించారని ఎమ్మెల్సీ కే. కవిత చేసిన ఆరోపణలపై హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రైతులను తప్పుదోవ పట్టించడం మానేసి, ఆ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులను వేగవంతం చేసి 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ÷-రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాగునీటి భద్రత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## 'మక్తల్' ఎత్తిపోతల పనుల్లో వేగం పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

తగదన్నారు. దీనికి సంబంధించి అదనపు పంపుల ఏర్పాటు కోసం అవసరమైన సివిల్ పనులకు వర్క్ ఆర్డర్ ఇచ్చి పూర్తి చేయించాలని చెప్పారు. కాగా మొదటి దశ పనులను డిసెంబర్ వరకు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి ఇంజనీరింగ్ అధికారులు హామీ ఇచ్చారు. రంగారెడ్డి- వికారాబాద్- నారాయణపేట ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంగా చర్చించి డిజైన్లు రూపొందించాలని సీఎం ఆదేశించారు. దీనికి సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని చెప్పారు. ఇది పూర్తయిన వెంటనే టెండర్ ప్రాసెస్ మొదలు పెట్టాలన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన మల్టీపర్పస్ ఇండ్రస్టియల్ పార్క్‌కు అవసరమైన భూసేకరణపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ముంబై-- పుణె కనెక్టివిటీ మాదిరిగానే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కొడంగల్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డుపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఇండస్ట్రియల్ పార్కులు, ఎడ్యుకేషన్ హబ్ అభివృద్ధి పనులకు కనీసం 5 వేల నుంచి 10 వేల ఎకరాల భూమిని సేకరించాలని సూచించారు. కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల ఇండ్రస్టియల్ పార్క్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. హకీంపేట, లగచర్ల, పోలేపల్లి శివారులో రూ.5 వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ దేశానికే తలమానికం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆశించిన స్థాయిలో పురోగతి లేదని అసహనం వ్యక్తంచేశారు. వచ్చే ఏడాది మార్చిలోపు పనులన్నీ పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ వేగవంతం చేయాలని చెప్పారు. సమావేశంలో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దానకిషోర్, వికాస్‌రాజ్, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, క్రిస్టినా జెడ్ చోంగ్తూ, ఎన్.శ్రీధర్, పలువురు ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళ్లు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా రైతుల పక్షాన బాధ్యతాయుత పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు స్టార్ట్ చేసి సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి రైతులు నారుమడులు పోసుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం నీళ్లు ఇవ్వమని చెబుతున్నాడని అన్నారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని మండిపడ్డారు. ప్రపంచమంతా నీళ్లను కాపాడుకుంటే.. మీరు వృథా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాకాల ప్రాజెక్టు కింద 29వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అక్కడి రైతులు నాట్లు వేసుకున్నారని, రామప్ప కింద కూడా నాట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. రామప్ప కింద 5500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నిన్న పాకాల కింద తూములు మూసేశారని పేర్కొన్నారు. నమ్మి నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి ఏంటి అని నిలదీశారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేస్తే రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. నీళ్లు ఎత్తకుండా కలెక్టర్ ఎందుకు తూములు మూసేయమని చెప్పాడని ప్రశ్నించారు. మంత్రులు చెప్పింది తప్పయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించి, రైతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడతారని హరీశ్‌రావు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి నార్లు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. బిందెలు, సీసాలతో పత్తికి బొట్టు బొట్టు నీళ్లు జల్లుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఉన్న తపన, సోయి రేవంత్ రెడ్డికి లేదా అని మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణ రైతులు ఎంతో తపన పడుతున్నారని తెలిపారు. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలు ఎందుకు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నీళ్లు కిందకు విడిచిపెడుతున్నాడని మండిపడ్డారు.

## జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

### ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు

**హైదరాబాద్, జులై 21 :** జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యికోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తున్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చించకుండా దీన్ని అమలు చేస్తున్నారు. ÷ాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయాలన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.



## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో ఎన్నో విపత్తులు ఎదుర్కొన్నామని.. ఎన్‌లినోను కూడా ఎదుర్కుంటామన్నారు. అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. సంవృద్ధిగా వర్షాలు పడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆషాఢమాస బోనాలు ఘనంగా జరిగేలా దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని ఏర్పాట్లు చేసినా చిన్న చిన్న ఇబ్బందులు జరుగుతుంటాయని.. వాటిని అధిగమించి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర మీద ఉండాలని, సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి

### హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హన్మకొండ,జులై 21 :** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు.

# సిజెపి ఆందోళన వెనక కుట్ర కోణం?

**ప్రాణాలకు తెగించి రావాలని సందేశాలు**

**ప్రాణత్యాగాలు చేసిన వారిని గుర్తుంచుకుంటాం**

**సీక్రెట్ యాప్‌తో పరస్పరం సందేశాలు చేరవేత**

**సంసద్ యాత్రపై కూపీ లాగుతున్న పోలీసులు**




**న్యూఢిల్లీ, జూలై 21 :** దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం చేపట్టిన చలో సంసద్ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడం ఒక ఎత్తయితే..వారి ఆందోళనల వెనక ఉన్న కుట్ర కోణాలను పోలీసులు కూపీ లాగుతున్నారు. సోమవారం నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో పలువురు నిరసనకారులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం కూడా పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. దీంతో రాజధానిలో హై టెన్షన్ నెలకొంది. మరోవైపు విపక్ష పార్టీలు ప్రధాని మోడీ నివాసం ఎదుట నిరసనకు దిగారు. సర్వత్రా టెన్షన్.. టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. అయితే తాజాగా పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీజేపీ నిరసన హింసాత్మకంగా మారడానికి భారీ కుట్ర జరిగినట్లుగా పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. సోమవారం ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయినా పెద్ద ఎత్తున నిరసనకారులు ఎలా రాగలిగారు అన్న దానిపై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిరసనకారులు పరస్పరం సందేశాలు పంపించుకున్నట్లు కొన్ని చాట్ సందేశాలు వెలుగులోకి వచ్చాయి. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయినా పరస్పరం సంప్రదింపులు కొనసాగించేందుకు బ్లూటూత్ ఆధారిత 'సీక్రెట్ యాప్' వినియోగించినట్లుగా తేటతెల్లమైంది. అంతేకాకుండా కొంతమంది ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని సందేశాలు పంపించుకున్నారు. ప్రస్తుతం ఈ సందేశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చాట్‌ల వెనుక ఉన్న రహస్యం, వాటిని పంపిన వ్యక్తుల గుర్తింపును ధృవీకరించే పక్రియ కొనసాగుతోంది. అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా బయటకు వచ్చిన చాట్‌లలో.. నిరసన ప్రాంతానికి చేరుకున్న తర్వాత మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవచ్చని హెచ్చరికలు ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా పోలీసులు నెట్‌వర్క్ జామర్లు ఉపయోగించారని, ఈసారి కూడా అదే జరిగే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ మార్గాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. 'నిరసన ప్రాంతానికి వెళ్లాక ఫోన్ నెట్‌వర్క్ ఉండకపోవచ్చు. అందుకే ముందుగానే అందరూ ఒకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని కనెక్ట్ అవ్వాలని సూచించినట్లు పోలీసులు గుర్తించారు. బ్లూటూత్ సిగ్నల్ ఆధారంగా పనిచేసే కొన్ని యాప్‌ల లింకులను కూడా అదే గ్రూపులో షేర్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ యాప్‌లపై సైబర్ నిపుణులు సాంకేతిక విశ్లేషణ చేస్తున్నారు. చాట్‌ల్లో తీవ్ర రాజకీయ హెచ్చరికలు కూడా ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఒక సందేశంలో రేపే మోడీ ప్రభుత్వానికి చివరి రోజు అని ఉంది. మరోవైపు కొందరు నిరసనకారులు ఉద్యమం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నవారు గుర్తుంచుకోండి.. మీ త్యాగాన్ని భావితరాలు గుర్తుంచుకుంటాయి.' అని ఉండగా.. మరో సందేశంలో 'ఎవరైనా చనిపోతే ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలేనా? లేక నిరసనలను హింసాత్మకంగా మార్చేందుకు ముందస్తు వ్యూహంలో భాగమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చాట్ సందేశాలతో పాటు సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ వీడియోలు, మొబైల్ ఫోన్ వీడియోలు, ఇతర డిజిటల్ ఆధారాలను కూడా ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు అధికారులు తెలిపారు. పోలీసుల ప్రకారం.. ప్రతి డిజిటల్ సందేశాన్ని సాంకేతికంగా ధృవీకరించిన తర్వాతే సాక్ష్యంగా పరిగణిస్తామని, దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగానే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## దేశ యువత కోసం రాహుల్ గాంధీ పోరాటం

**ఎక్స్‌వేదికగా సిఎం రేవంత్ రెడ్డి పోస్ట్**



**హైదరాబాద్,జులై 21 :** యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.




## రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

**ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు**

**కార్యాచరణతో ముందుకు సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం**

**రంగారెడ్డి,జూలై21 :** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, అరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబందించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## సన్న వడ్ల కుంభకోణం గతంలో జరిగిందేమో?

**ఈ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగలేదు**

**హరీష్ రావు తదితరుల విమర్శలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్**



**హైదరాబాద్,జూలై21 :** ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభకోణం అనేది అవాస్తవమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడియా – సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్ రావును మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## సర్ ప్రక్రియలో ఓటర్లంతా పాల్గొనాలి

**ప్రజలకు మంత్రి ఉత్తమ్ వినతి**

**హైదరాబాద్,జులై 21 :** హుజూర్ నగర్ ఓటర్లు వందకు వందశాతం సర్ ప్రక్రియలో పాల్గొనాలని మంతంరిచ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ఈమేరకు ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నాకు ప్రాణ సమానులైన , ఎంతో ప్రియమైన హుజూర్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ కుటుంబ సభ్యులందరికీ , నా అన్నలు, తమ్ములు, అక్కలు, చెల్లెల్లు అందరకీ నమస్కారం. ఇప్పుడు మీ అందరికీ తెలిసిన విషయమే ఓటరు జాబితా సవరణ కొనసాగుతుంది. ఈ ప్రోగ్రాం లో రాష్ట్రస్థాయి నుండి గ్రామస్థాయి వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరూ శ్రద్ధతో పాల్గొనవలసిందిగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ?నేను ఈ విజ్ఞప్తి ద్వారా హుజూర్ నగర్ నియోజకవర్గంలో ప్రతి నాయకుడికి, కార్యకర్తకి మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. మీ వార్డులలో,మీ గ్రామాలలో, మీ పట్టణాలలో ఓటరు జాబితా సవరణ క్రింద నూటికి నూరు శాతం ఓటర్స్ ఎన్యుమరేషన్ ఫామ్స్ నింపి భర్తీ చేసే విధంగా మీరు ఈరోజు, రేపు కార్యక్రమం పూర్తి చేయవలసిందిగా మరోమారు విజ్ఞప్తి చేస్తున్నాను.




## ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

**కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత**

**హైదరాబాద్, జులై 21 :** ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి మంగళవారం ఆమె అందజేశారు. అనంతరం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి వద్ద ఆమె మాట్లాడుతూ.. స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఈ సందర్భంగా ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆ కమిటీ చైర్మన్‌తో ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగితే తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కె. కేశవరావును నియమించింది.

## అక్రిడేషన్ల కోసం జర్నలిస్టుల ఆందోళన

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ యూనియన్ నేతలు**

**రాజన్న సిరిసిల్ల,జులై 21 :** జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న జాప్యంపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో జర్నలిస్టులు మరోసారి గళమెత్తారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జర్నలిస్టులు భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పాల్గొని నిరసన తెలిపారు. సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామల గట్టు నాయకత్వంలో జరిగిన ఈ ఆందోళనలో అక్రిడిటేషన్ కార్డుల జారీ పక్రియలో నెలల తరబడి ఆలస్యం చేయడం వల్ల అర్హులైన జర్నలిస్టులు ప్రభుత్వ గుర్తింపు, సంక్షేమ పథకాలు, రవాణా సౌకర్యాలు వంటి అనేక ప్రయోజనాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఆరు నెలలకు బస్సు పాస్‌లను తాత్కాలికంగా పునరుద్ధరించుకోవాల్సిన పరిస్థితి జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టులు తమ హక్కుల కోసం వర్షంలో రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమని విమర్శించారు. ధర్నా విషయం తెలుసుకున్న కలెక్టరేట్ అధికారి ఆందోళన స్థలానికి చేరుకుని నాయకుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

## హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

**గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని సెక్యూరిటీ సూచన**

**రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు ఆగ్రహం**




**హైదరాబాద్, జూలై 21 :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది. వీఐపీలు ప్రవేశించే గేట్ నంబర్ 6 నుంచి కాకుండా, సామాన్య ప్రజలు ప్రవేశించే గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని రంగనాథ్‌కు సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో గేట్ నంబర్ 4 వద్ద సామాన్య ప్రజలు వాహనాలు పార్క్ చేసే స్థలంలో కారు పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లారు. కాగా, ప్రైవేట్ ఆస్తి వివాదంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం వెనుక కారణమేమిటని నిలదీసింది. ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెకచేయకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన అలవాటుగా మారిందా? కోర్టు ధిక్కరణనే పరిపాటిగా మార్చుకున్నారా? అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకటి కాదు, రెండు కాదు, ఒకే అంశంపై మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలవుతున్నాయంటే కోర్టు ఉత్తర్వుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్న దని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుల పట్ల ఎంత గౌరవం ఉన్నదో ఈ పరిణామాలే చెప్తున్నాయని పేరొంది. ఇకడ బాధితుడు పిటిషనర్ కాదని, స్వయంగా కోర్టేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధికరించడం ఎంతమాత్రం సహించబోమని రంగనాథ్‌కు తేల్చిచెప్పింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వాధికారులైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పకనపెట్టి ప్రైవేటు భూముల్లోకి వెళ్లడం ఏ చట్టం ప్రకారం సమర్థనీ యమని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేటు భూమిలో అడుగు పెట్టరాదన్న ప్రాథమిక సూత్రం తెలియదా అని నిలదీసింది. ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేటు వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు చేశారని ప్రశ్నించింది.

## ప్రజలకు సమర్థంగా సేవలందించాలి

**అధికారులకు పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం**

**పెద్దపల్లి,జులై 21 :** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా, నాణ్యంగా అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ గుండారం ఎంపీపీఎస్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నూతన తహసీల్దార్ కార్యాలయం, ఎస్ఐఆర్ ఓటరు నమోదు పక్రియ, పెంచికల్‌పేట్ గ్రామంలోని సింగరేణి భూములు, రామగిరి నూతన తహసీల్దార్ కార్యాలయం, మేడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గుండారం ఎంపీపీఎస్. పాఠశాలలో ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు బోధన అందించాలని, ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు పూర్తిస్థాయిలో అలవడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ బోధన, విద్యార్థుల హాజరు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను పరిశీలించి విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. కమాన్‌పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం, మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఆగస్టు 1 నుంచి కొత్త భవనం నుంచే తహసీల్దార్ కార్యాలయ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు పక్రియను పరిశీలించిన కలెక్టర్, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రతీ దశను కచ్చితత్వంతో అమలు చేయాలని ఆదేశించారు. పెంచికల్‌పేట్ గ్రామంలోని సింగరేణి భూములను పరిశీలించిన కలెక్టర్, భూ వివాదాల పరిష్కారం కోసం అసిస్టెంట్ డైరెక్టర్ (ల్యాండ్ సర్వే)ఆధ్వర్యంలో సమగ్ర భూ సర్వే నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ లేబర్ రూమ్, వ్యాక్సినేషన్ విభాగాన్ని పరిశీలించారు.

## డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ముఖాముఖి

**ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి పర్మినెంట్ కార్పొరేషన్**

**చట్టబద్ధత ఇవ్వాలని జెఎసిల డిమాండ్**

**హైదరాబాద్,జులై 21 :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సంప్రదింపులు కొనసాగిస్తోంది. మంగళవారం వైద్యులు, న్యాయవాదులు, విలేఖరులుసమక్షంలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు ప్రముఖ సామాజిక నాయకులు మరియు వివిధ వర్గాల అగ్రశ్రేణి ప్రతినిధులు హాజరయ్యారు, అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్ నాయకులు), ఎమ్. రాజేందర్ రెడ్డి (అడ్వకేట్ జేఏసీ కన్వీనర్), ఎస్. సత్యం రెడ్డి (హైకోర్టు మాజీ ప్రెసిడెంట్), టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. సమావేశానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా హాజరై కమిటీకి తమ పూర్తి మద్దతును ప్రకటించారు. భారత స్వాతంత్య సంగ్రామ సమయంలో నాటి ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు చారిత్రాత్మక జీవోల ప్రతులను కమిటీ ప్యానల్‌కు సమర్పించారు. జార్ఖండ్ తో పాటు ఇతర కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాల్లో అమలు చేసిన ఉద్యమకారుల గుర్తింపు విధానాలను పరిశీలించి, తెలంగాణలో త్వరితగతిన అర్హుల గుర్తింపు పక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తిపై కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు స్పందిస్తూ.. 'నేను జార్ఖండ్ రాష్ట్రానికి 3 సంవత్సరాల పాటు ఇన్ ఛార్జీగా పనిచేశాను. అక్కడ అమలైన విధానాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. అంతకంటే మెరుగ్గా, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం. అన్ని రాజకీయా పార్టీల నుండి, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు.

## తమ్మినేని సీతారాంనకు చుక్కెదురు

**క్వాష్ పిటిషన్ తిరస్కరించన ఎపి హైకోర్టు**

**అమరావతి,జులై 21 :** మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ తమ్మినేని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని పేర్కొన్న న్యాయస్థానం.. ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని స్పష్టం చేసింది. అరెస్టు భయం ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. ఈ కేసుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జులై 29కి వాయిదా వేసింది. నకిలీ పత్రాలను ఉపయోగించి సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిని తన కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలతో తమ్మినేనిపై కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో కేసును రద్దు చేయాలని కోరుతూ తమ్మినేని హైకోర్టును ఆశ్రయించారు. అయితే కేసు ప్రాథమిక దశలో ఉన్నందున క్వాష్ చేయడానికి నిరాకరించిన హైకోర్టు.. చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించింది.

# ఉరుముతున్న యుద్ధమేఘాలు!



**పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు మళ్లీ కమ్ముకోవడంతో ప్రపంచదేశాలు దిక్కుతోచని స్థితికి చేరాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడా మళ్లీ తీవ్రస్థాయికి చేరింది. నియంతల కారణంగా ప్రపంచానికి శాంతి లేకుండా పోతోంది. వాళ్లు,వాళ్లు కొట్టుకు చస్తున్నా ఫర్వాలేదు..ఇందులో మిగతా దేశాలు తల్లడిల్లి పోతున్నాయి. ముఖ్యంగా అమెరికా మళ్లీ ఇరాన్‌పై భీకరదాడులుకు దిగుతోంది. ట్రంప్‌ను అంతమొందిస్తాం అంటూ ఇరాన్‌లో పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. అలాగే ప్రపంచంలోని అమెరికన్లు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా ప్రజలకు హెచ్చరికలు చేసింది. ఈ క్రమంలో యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చనుందన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో చమురు సమస్యలు మళ్లీ మొదటికి అన్నట్లుగా పరస్థితులు కనిపిస్తున్నాయి.**

ఇరాన్‌ను సర్వనాశనం చేసే వరకు వదలనని ట్రంప్ భీష్మించుకున్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ వెనక్కి తగ్గగా అమెరికానే యుద్ధాన్ని ఎగదోస్తోంది. మరోవైపు అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హార్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్యత ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తో పాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, వాటిని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదని తెలిపారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు అధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒక వేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం దాదాపు ఐదు నెలలు కావస్తోంది. అయినా అగ్గి చల్లారడం లేదు. ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ట్రంప్ మళ్లీమళ్లీ దాడులకు తెగిస్తున్నారు. తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండ బోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతి ఒప్పందానికి చిల్లు పెట్టారని, ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు.

ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి చర్చలు జరగడం లేదు. ఇకపై మంచివాడిగా ఉండను అని గతంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు తాజా పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచదేశాలు కూడా పెద్దగా స్పందించడం లేదు. ఏ దేశం కూడా ఈ సుదీర్ఘ యుద్ధానికి అడ్డుపడడం లేదు. ఇరాన్ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. అయితే ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాడోపేడో తేల్చుకునేదాకా వదిలేది లేదని హెచ్చరికలు చేస్తోంది. అలాగే అమెరికా స్థావరాలపై భీకర దాడులు చేస్తోంది. ఈక్రమంలో ఈ యుద్ధం ఇప్పట్లో ముస్తుందని అనుకోవడానికి లేదు. ప్రపంచదేశాలు ఏకమైతే తప్ప యుద్ధ పరిస్థితులను అదుపు చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.

# పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందం

**ఇప్పుడున్నట్లుగా కొనసగాడం కుదరదు**

**కృతనిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం**



**న్యూఢిల్లీ, జూలై 21 :** సింధూ జలాల ఒప్పందం ప్రస్తుత రూపం లోనే మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశమే లేదని తెలుస్తోంది. ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి వస్తే.. మార్పులు తప్పనిసరి అని భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రదర్శిస్తోంది. అది కూడా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడితేనే సాధ్యమవుతుందని చెబుతోంది. ఈ మేరకు ప్రభుత్వవర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. గతేడాది పహల్గాం దాడి తర్వాత భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గట్టి బుద్ధి చెప్పింది. ఇరు దేశాల మధ్య ఆరు దశాబ్దాలకుపైగా ఉన్న సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది . అయితే.. ప్రస్తుతానికి ఆ ఒప్పందం నుంచి వైదొలగాలని ప్రభుత్వం ఆలోచించడం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు తేలితే.. ఒక సార్వభౌమ దేశంగా దానిని రద్దు చేసే హక్కు భారత్‌కు ఉందని పేర్కొన్నాయి. సింధూ జలాల విషయంలో భారత నిర్ణయం పాకిస్థాన్ చర్యలపైనే ఆధారపడి ఉంటుందన్నాయి. ఆ ఒప్పందం నిలిపివేసినప్పటి నుంచి ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్.. సింధూ జలాల్లో తమ వాటా తీసుకుంటే తీవ్రపరిణామాలు తప్పవని ప్రేలాపనలు చేస్తోంది. ఒప్పందం నిలిపివేత వల్ల ఆ దేశంలో నీటికొరత ఏర్పడుతోందని చేస్తోన్న ప్రకటనలను భారత్ ఖండిస్తోంది. నీటిని నిల్వ చేసే సామర్థ్యాలు లేకనే భారతదేశాన్ని నిందిస్తూ.. పాక్ తప్పుడు ప్రచారం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్ పదేపదే ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ.. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దాయాది అర్థవంతమైన చర్యలు తీసుకున్న దాఖలాలు ఏవీ లేవన్నాయి. అదీగాక ఐక్యరాజ్యసమితి నిషేధిత జాబితాలో ఉన్న వ్యక్తులు పాక్‌లో బహిరంగ కార్యక్రమా ల్లో కనిపిస్తున్నారని ఎండగట్టాయి. పశ్చిమ నదులైన జీలం, చినాబ్‌లపై జమ్మూకశ్మీర్‌లో నిర్మితమవుతున్న జల విద్యుత్ కేం ద్రాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆ ప్రాజె క్టులను ఆలస్యం చేసేందుకు ఒప్పందంలోని వివాదాల పరిష్కారా లకు సంబంధించిన నిబంధనలను పాక్ దుర్వినియోగం చేస్తోం దని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్ , పాకిస్థాన్‌ల మధ్య 1960లో ఒప్పందం కుదిరింది.

# పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తం

**పూర్తిస్థాయి యుద్ధం చేస్తున్నామన్న ఇరాన్**



**టెహ్రాన్, జూలై 21 :** అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ప్రస్తుతం కేవలం సైనిక పరంగానే కాకుండా ఆర్థిక రంగంలో కూడా తీవ్ర పోరాటం కొనసాగుతోందని, ప్రజల జీవనోపాధిని కాపాడటం ప్రభుత్వానికి అత్యంత కీలక బాధ్యతగా మారిందని ఆయన పేర్కొన్నారు. దేశం యుద్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజల దైనందిన జీవితం దెబ్బతినకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెజెష్కియన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ప్రజల జీవన ప్రమాణాలను కాపాడడం ప్రస్తుతం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరాన్ వ్యాప్తంగా అమెరికా దాడులు చేస్తోందని, ఆ పరిణామాలను దేశ ప్రజలు అంగీకరించాలని కోరారు. టీవల కొద్ది రోజులుగా అమెరికా-ఇరాన్ మధ్య వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ చమురు సరఫరాపై కూడా ప్రభావం పడుతో ంది. అయితే యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, ఉద్రిక్తతలను తగ్గించేందుకు పలు దేశాలు దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. కానీ, ఇరు దేశాలు తమ తమ వైఖరిని మార్చుకోకపోవడంతో పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే ఉంది.

# పశ్చిమాసియా యుద్ధంతో అమెరికా అడ్వైజరీ జారీ

**ప్రపంచంలోని అమెరికాను పౌరులకు హెచ్చరికలు**

**అప్రమత్తంగా ఉండాలని సూచనలు**

**వాషింగ్టన్,జూలై21 :** పశ్చిమాసియాలో రోజురోజుకూ ఉద్రిక్త పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ పౌరులకు 'వరల్డ్‌వైడ్ కాషన్' పేరుతో భద్రతా హెచ్చరిక జారీ చేసింది. అమెరికన్లు విదేశాల్లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించింది. పశ్చిమాసియలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా ప్రయోజనాలు, పౌరులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసినట్లు స్టేట్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ముఖ్యంగా అమెరికా రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలని పౌరులకు సూచించింది. వసరం లేని ప్రయాణాలను నివారించాలని, జనసమ్మర్ధ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక వార్తలు, భద్రతా హెచ్చరికలను నిరంతరం గమనించాలని, సమీపంలోని అమెరికా రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్ సూచనలను అనుసరించాలని, అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించింది. గత కొద్ది రోజులుగా ఇరాన్‌పై అమెరికా వరుస దాడులు చేస్తోంది. ఇరాన్‌లోని పలు కేంద్రాలపై వైమానిక దాడులు చేస్తోంది. అందుకు ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ నేపథ్యంలో పలు దేశాల్లో ఉన్న అమెరికా పౌరులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ డిపార్ట్‌మెంట్ హెచ్చరిక జారీ చేసింది.

# అసోంను ముంచెత్తిన వరదలు

**భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలం**

**పదిమంది మృతి..లక్షలాది మంది నిరాశ్రయులు**



**గౌహతి, జూలై 21 :** అస్సాంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ వానల కారణంగా ఇప్పటివరకు 10 మంది మృతిచెందగా, లక్షల మంది నిరాశ్రయులయ్యారు. వర్షాలకు అస్సాం రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో 794 గ్రామాలు ప్రభావితమయ్యాయి. శివసాగర్, చరైడియో, జోర్హాట్, దిబ్రూఘర్, సోనిత్‌పూర్, బిస్వనాథ్, గోలాఘాట్, ధేమాజీ, తిన్‌సుకియా, నాగావ్, కర్బీ అంగ్లాంగ్, కాచర్, ఉదల్‌గురి, చిరాంగ్, కమ్‌రూప్, కమ్‌రూప్ (మెట్రో) జిల్లాలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఆయా జిల్లాల్లో మొత్తం 3.62 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. అధికారులు 101 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలతో నదులకు వరదనీరు పోటెత్తుతోంది. నేమతిఘాట్ వద్ద బ్రహ్మపుత్ర, చెనిమారి (ఖోవాంగ్) వద్ద బుర్హిదిహింగ్, నాంగ్లామురాఘాట్ వద్ద దిసాంగ్, నుమాలిగఢ్ వద్ద ధన్‌సిరి (దక్షిణ), శివసాగర్ వద్ద దిఖౌ నదులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు వరదనీరు జనావాసాల్లోకి వచ్చింది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అనేక రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షాలకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు 19,100 హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. మరోవైపు, అస్సాంలోని కొన్ని ప్రాంతాల్లో మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు చెరువులు, నదుల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారుల సూచనలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచిస్తున్నారు.



# జమ్మూ కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

**కొండ చరియలు విరిగి పడి పలువురు గల్లంతు**

**వరదలతో ఇప్పటికే పలువురు మృతి**

**శ్రీనగర్,జూలై21 :** జమ్మూకశ్మీర్‌లో మేఘ విస్ఫోటం కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా సరిహద్దు జిల్లాలైన పూంఛ్, రాజౌరీల్లో ఇప్పటికే 12 మంది మృతి చెందగా.. పలువురు గల్లంతయ్యారు. రోడ్లు, ఇళ్లుసహా పలు ప్రభుత్వ, ప్రైవేటు మౌలిక సదుపాయాలు చాలావరకు దెబ్బతిన్నాయి. దీంతో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం దిల్లీలో రాష్ట్ర హోదా కోసం తలపెట్టిన ఆందోళనను విరమించుకుని జమ్మూకు హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. పూంఛ్ జిల్లాలోని సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో ఎక్కువ విధ్వంసం జరిగింది. ఇక్కడే అధికంగా 10 మరణాలు సంభవించాయి. 9 మృతదేహాలు లభ్యమైనప్పటికీ.. కనీసం 16 మృతి చెంది ఉండే అవకాశం ఉందని పూంఛ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ కుమార్ శర్మ తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని రియాస్ జిల్లాలో వర్షాలవల్ల మాతా వైష్ణోదేవి యాత్రను తాత్కాలికంగా నిలిపేశారు. సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో సంభవించిన మేఘ విస్ఫోటం మహమ్మద్ లతీఫ్ అనే ఒక వ్యక్తి జీవితంలో ఊహించనంత విషాదాన్ని నింపింది. భారీ వర్షం కారణంగా ఆయన తన వాహనాన్ని సురక్షిత ప్రాంతంలో పార్క్ చేయడానికి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి.. ఆయనకు చెందిన మూడంతస్తుల భవనం మట్టి, బురదలో కూరుకుపోయింది. దీంతో అందులోని 8 మంది కుటుంబసభ్యులు మరణించారు. లతీఫ్‌తో పాటు అతని పెద్ద కుమారుడు మాత్రమే బతికి బట్టకట్టారు. ప్రమాదం సమయంలో లతీఫ్ కుమారుడు జమ్మూలో ఉన్నారు.

# సిక్కింలో ఘోర విషాదం

**నిర్మాణంలో ఉన్న సొరంగంపై విరిగిపడ్డ కొండచరియలు**

**పదిమంది కార్మికుల దుర్మరణం**




**గ్యాంగ్‌టక్, జూలై 21 :** సిక్కింలో ఘోర విషాదం చోటుచేసుకుంది. దక్షిణ సిక్కింలోని సమర్‌దుంగ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగం వద్ద కొండచరియలు విరిగిపడటంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు పదిమంది మృతిచెందారు. వారి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. మరో 20 మందికిపైగా కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను నామ్చి జిల్లా కలెక్టర్ అనుప తమ్లింగ్ వెల్లడించారు. సోమవారం తీస్తా స్టేజ్-జలవిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సొరంగంలో ఈ ప్రమాదం జరిగింది. పటేల్ ఇంజినీరింగ్ సంస్థ నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా, సొరంగం లోపల అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడి మార్గం పూర్తిగా మూసుకుపోయింది. అదే సమయంలో మీథేన్ గ్యాస్ లీక్ కావడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఘటన అనంతరం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, సిక్కిం పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర సేవల బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. అయితే సొరంగంలో మీథేన్ గ్యాస్ స్థాయిలు అధికంగా ఉండటంతో రక్షణ సిబ్బంది లోపలికి వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదనంగా ఎన్‌హెచ్‌పీసీకి చెందిన ఆరుగురు సిబ్బంది కూడా లోపలే ఉన్నట్లు సమాచారం. సొరంగంలోకి ప్రవేశించిన తొలి సహాయక బృంద సభ్యులు మీథేన్ ప్రభావంతో శ్వాస తీసుకోవడంలో పలు సమస్యలను ఎదుర్కొన్నారు. వారిని వెంటనే బయటకు తీసుకువచ్చి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.




# ఖమ్మంలో ఎస్ఐఆర్‌కు స్పీడ్

- ఐదు రోజుల్లో 90% డిజిటలైజేషన్ లక్ష్యం
- ఓటర్ల జాబితా సవరణలో వేగం పెంచాలని కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశం

**ఖమ్మం, జూలై 21:** ఖమ్మం జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, రానున్న ఐదు రోజుల్లో 90 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా ప్రతి బూత్ స్థాయిలో- వేగవంతమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పాల్గొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే 80 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 65 శాతం పురోగతి నమోదైందని వివరించారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన సుమారు 55 వేల మంది (5 శాతం) ఓటర్ల వివరాలను పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో 85 శాతం వరకు డిజిటలైజేషన్ పూర్తయినట్లేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. సోమవారం ఒక్కరోజే 20 వేల మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్న కలెక్టర్, ఇదే వేగం కొనసాగితే రానున్న ఐదు రోజుల్లో 90 శాతం లక్ష్యాన్ని చేరుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు.

### బీఎల్‌వోలకు ప్రత్యేక లక్ష్యాలు.. పట్టణాలపై ఫోకస్

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో) నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్య సాధనపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.
పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పనులను మరింత వేగవంతం చేయాలని, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల నింపడంలో ప్రతి ఓటరికి బీఎల్‌వోలు సహకరించాలని, ఎన్నికల సంఘం రూపొందించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ల వివరాల ఖచ్చితత్వం, పారదర్శకత, సమయపాలనకు ప్రాధాన్యత ఇస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీతో పాటు ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# గంభీరావుపేటలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**కూకట్‌పల్లి, జూలై 19, (జనం వార్త) :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో శ్రీ మహంకాళి అమ్మవారికి బోనాల ఉత్సవాలను గ్రామ ప్రజలుఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ బోనాల ఉత్సవాలలో మహిళలు,యువకులు,చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుండి మహిళలు, యువతులు అందంగా అలంకరించిన బోనాలను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అలంకరించిన బోనాలను డప్పు చప్పులతో, యువకుల నృత్యాలతో అమ్మవారి ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపుగా తరలి వెళ్లారు.





బోనాల సమర్పించిన మహిళలతో పాటు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గంభీరావుపేటలో అత్యంత వైభవంగా బోనాల ఉత్సవాలకు నిర్వహిస్తామన్నారు. ఘనంగా నిర్వహించే బోనాల ఉత్సవాలకు గ్రామ ప్రజలు ఎక్కడ ఉన్నా బోనాల ఉత్సవాలకు తప్పనిసరిగా తమ స్వగ్రామానికి చేరుకుంటారన్నారు. మన సంస్కృతిని సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ బోనాల ఉత్సవాలలో భారీ సంఖ్యలో మహిళలు, భక్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీలో

# అంతర్గత విభేదాలకు చెక్

- ముప్పు శ్రీనివాస్ రెడ్డిని కలిసిన డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు.
- పార్టీ బలోపేతానికి నాయకుల ఐక్యమత్యంతో ముందుకు రావాలి
- నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్



**నాగారం,జూలై 21(జనం వార్త) :** నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీలో గత కొన్ని రోజులుగా నెలకొన్న అంతర్గత విభేదాలకు తెరపడింది. ఈ సందర్భంగా నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లసాని భూమయ్య యాదవ్,డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి నివాసానికి మంగళవారం వచ్చారు.అనంతరం డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పార్టీ బలోపేతం,కార్యకర్తల ఐక్యత,భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.గతంలో జరిగిన చిన్నచిన్న విభేదాలు,అపార్థాలను పక్కనబెట్టి,ఇకపై ఎలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా అందరం కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని ఏకాభిప్రాయానికి వచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,వ్యక్తిగత భేదాభిప్రాయాల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని,కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి నాగారం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తామని నాయకులు,కార్యకర్తలు ఐక్యమత్యంతో ముందుకు వచ్చి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుడూరు గౌడ్, మాజీ కౌన్సిలర్ హరిబాబు,సతీష్ గౌడ్, నల్లోల కుమార్, గనపురం కొండల్ రెడ్డి, నర్సింహారావు,బాలూ యాదవ్,సన్ని యాదవ్, ప్రవీణ్ యాదవ్,కె. రవి, పంగా సంతోష్,బాస రవి, మైపాల్ రెడ్డి, సోమిరెడ్డి, శ్రీశైలం గౌడ్,గండి శ్రీధర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.





# పోడు రైతులకు అండగా ఉంటా

- గిరిజనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల భరోసా
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**అశ్వాపురం, జూలై 21 :** అశ్వాపురం మండలంలోని వేములూరు, మనుబోతులపాడు గ్రామాల్లో ఇటీవల పోడు భూముల వివాదంలో బాధితులైన గిరిజన రైతులు, వారి కుటుంబాలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అండగా నిలిచారు. గ్రామాలను సందర్శించి బాధితులను పరామర్శించిన ఆయన, ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకుని వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందేలా స్థానిక సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని వెంట పంపించి భద్రాచలం ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలపై అటవీశాఖ అధికారులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. గిరిజన రైతుల పట్ల దురుసుగా ప్రవర్తించిన అధికారులపై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని తెలిపారు. దాడికి పాల్పడిన అధికారి సంపత్‌ను తక్షణమే సస్పెండ్ చేయడంతో పాటు, సంబంధిత ఎఫ్ఆర్ఓ సహా మరో ముగ్గురు అధికారులకు మెమోలు జారీ చేసినట్లు వెల్లడించారు. పోడు భూముల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి గిరిజన రైతులకు శాశ్వత పరిష్కారం లభించేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భవిష్యత్తులో అమాయక గిరిజనులపై చట్టవ్యతిరేకంగా, అమానుషంగా ప్రవర్తించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోడు రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తమకు అండగా ఉంటుందని పేర్కొంటూ అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని గిరిజన రైతులకు పిలుపునిచ్చారు.



# మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

### జిల్లా కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

**ఖమ్మం, జూలై 21:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), బూత్ లెవల్ సూపర్వైజర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మొక్కా శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు పట్టాభి, పసుపులేటి దేవేందర్, కిలారు అనిల్ కుమార్, కొమ్మినేని రమేష్ బాబు, ప్రభావతి రెడ్డి, హరిత రెడ్డి, ఝాన్సీ, స్వరూప, వినోద్, రేణుక, నాగరాజు, కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు, కంచర్ల వెంకటనర్సయ్య, మంకెన శ్రీనివాసరావు, హఫీజ్, గంగిశెట్టి ప్రసాద్, చిన్నారావు, అశోక్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే అది ఒక జాతీయ రహదారి. ఆ రహదారికి ఒకవైపు చిన్నచిన్న పరిశ్రమలతో పారిశ్రామిక వాడ మరోవైపు నిరుపేదలు నివాసముండే పలు కాలనీలు. నిరుపేదలు ఉపాధి కోసం ఈ జాతీయ రహదారిని దాటి పారిశ్రామిక వాడికి వెళ్ళవలసిందే. నిత్యం అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహ దారిని దాటాలంటేనే భయం కల్పించే సంఘటనలు ఎన్నో... ఎన్నోసార్లు రోడ్డు దాటుతూ కార్మికులు, స్థానికులు ప్రమాదాలకు గురైన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఈ ప్రాంతంలో కార్మికులు స్థానికులు రోడ్డు దాటడానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం కనిపించడం లేదు. ప్రశాంత్ నగర్ వద్ద రోడ్డు దాటాలంటే నిత్యం నరకం అనుభవిస్తున్న కార్మికులు, స్థానికుల సమస్యపై జనం వార్త ప్రత్యేక కథనం



# జాతీయ రహదారి.. దాటే దారేది..?

- ప్రశాంత్ నగర్ వద్ద రోడ్డు దాటాలంటేనే నరకమే.
- నిత్యం అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారి
- జీవనోపాధి కోసం ప్రతిరోజు నిరుపేద కార్మికులు భయపడుతూ రోడ్డు దాటాల్సిందే
- ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని కొన్ని సంవత్సరాలుగా వినతులు
- రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురైనవారెందరో.



**కూకట్ పల్లి, జూలై 21, ( జనం వార్త )** కూకట్ పల్లి నియోజకవర్గం ప్రశాంత్ నగర్ వద్ద జాతీయ రహదారిని దాటాలంటేనే కార్మికులు ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. జాతీయ రహదారికి ఓవైపు ఉన్న ప్రశాంత్ నగర్ లో చిన్నచిన్న పరిశ్రమలతో కూడిన పారిశ్రామిక వాడ మరోవైపు మూసాపేట్, జనతా నగర్ లతోపాటు పలు కాలనీలలో నిరుపేద,మధ్యతరగతి ప్రజలు నివాసం ఉంటున్నారు. ఈ కాలనీలలోని ఎంతోమంది నిరుపేద మహిళలు జీవనోపాధి కోసం ప్రశాంత్ నగర్ లోని పలు పరిశ్రమలలో వేలాది మంది కార్మికులుగా పనిచేస్తున్నారు. డ్యూటీలో భాగంగా కంపెనీకి వెళ్లాలన్న, విధులు ముగించుకుని తిరిగి ఇంటికి రావాలన్న ఈ జాతీయ రహదారినే నడుచుకుంటూ దాటాల్సిన పరిస్థితి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని నడుచుకుంటూ దాటడం మహిళలకు, కార్మికులకు కష్టతరంగా మారింది. ఉదయము,సాయంత్రం సమయంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో రోడ్డు దాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్ గాంధీ నగర్, శ్రీశ్రీ నగర్, ఇందిరానగర్ కాలనీవాసులు కూకట్ పల్లి,లింగంపల్లి, అమీర్ పేట్, నాంపల్లి వైపు వెళ్లాలంటే రోడ్డు దాటి బస్సు టెర్మినల్ వైపు వెళ్లడానికి ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు రోడ్డు దాటాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు దాటడానికి పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానిక కాలనీ వాసులు, కార్మికులు, ప్రయాణికులు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు దాటుతున్న సమయంలో ఎన్నో సార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇక్కడ నెలలో రెండు, మూడు సార్లు రోడ్డు ప్రమాదం జరగడం సర్వ సాధారణమైందని కార్మికులు, స్థానిక ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా సత్వరమే చర్యలు తీసుకోవాలని కార్మికులు,కాలనీవాసులు, స్థానికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ నిరుపేద కార్మికుల ఆవేదనను సంబంధిత అధికారులు అర్థం చేసుకుంటారా...? ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తారా... ? లేదా...? వేచి చూడాలి మరి..!!



– రాము సామల
939 939 6555

## తమ్మినేని భూ ఆక్రమణపై
# చర్యలు తప్పవు

- వైసిపి ఐదేళ్ల భూభాగోతాలపై పూర్తిస్థాయి విచారణ
- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



**అమరావతి, జూలై 21 :** వైసీపీ నేత, ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారం భూ అక్రమాలతో తప్పకుండా చర్యలు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు భూమి పట్ల చట్టవిరుద్ధంగా వ్యవహరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడారు. గొడ్డలి పార్టీకి రాజకీయ స్వలాభం కోసమే అసత్య ఆరోపణలు చేస్తోందని మంత్రి అనగాని ధ్వజమెత్తారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేవే ఆర్ఎస్కేలు అని వెల్లడించారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప ఏ ఒక్కరికీ నష్టం చేయవని స్పష్టం చేశారు. డాక్యుమెంట్ రైటర్లను పిలిపించి మాట్లాడితే వారు కూడా దీని పట్ల సానుకూలంగా స్పందించారని అన్నారు. కొందరు కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్కేలు ఓ నూతన సాంకేతిక విధానమని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేవే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే)ని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప ఏ ఒక్కరికీ నష్టం చేయవని స్పష్టంచేశారు. కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్కేలు.. ఒక నూతన సాంకేతిక విధానమని తెలిపారు. గొడ్డలి పార్టీ రాజకీయ స్వలాభం కోసమే అసత్య ఆరోపణలు చేస్తోందని మంత్రి ఆరోపించారు. తమ్మినేని భూ అక్రమాలతో పాటు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు భూమిపై చట్టవిరుద్ధం గా వ్యవహరించిన వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. గత 5 ఏళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయని మంత్రి అనగాని స్పష్టం చేశారు.

## జంతర్‌మంతర్ ఆందోళనకారులపై
# లాఠీఛార్జ్‌కు కాంగ్రెస్ నిరసన

**ప్రధాని నివాసం ముందు మెరుపు ధర్నా**

**మోడీ రాజీనామా చేయాలన్న రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ, జూలై 21 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. గూండాగిరి, నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత చర్యలు నడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ధర్నా సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నిన్న యువతపై లాఠీచార్జ్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించలేదని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని, నీట్ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ మార్చ్ సందర్భంగా ఢిల్లీ పోలీసులు విద్యార్థులు, నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. విద్యార్థులపై అణచివేతకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ నాయకులు లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో పవన్ ఖేరా, పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షులు అమరీందర్ సింగ్ రాజా వారింగ్, దీపేందర్ హుడా, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల్ని బీజేపీ ప్రభుత్వం క్రూరంగా హింసించిందని, కానీ బాధ్యత వహించడానికి, పార్లమెంట్‌లో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ నేతల ధర్నాతో ఒక్కసారిగా ఢిల్లీలో హైడ్రామా చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ కాంగ్రెస్ ధర్నా చేస్తున్న ప్రదేశానికి చేరుకుని రాహుల్ గాంధీతో చర్చిస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలని రాహుల్ గాంధీకి నచ్చచెప్పేలా ప్రయత్నిస్తున్నారు. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో చర్చించారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు రాజీనామా చేయాలంటూ నినాదాలు చేస్తున్నారు.

## పోలవరాన్ని గాలికి వదిలేసిన జగన్

**ఇరిగేషన్ వ్యవస్థను విధ్వంసం చేశారు : మంత్రి నిమ్మల**

**అమరావతి, జూలై 21 :** నీటి ప్రాధాన్యాన్ని టిడిపి వ్యవస్థాపకుడు అన్న ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకూ గుర్తించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు పోలవరం, ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఒకవైపు వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థ .. మరోవైపు విధ్వంసమైన ఇరిగేషన్‌ను అప్పగించారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. నేడు ఇరిగేషన్ శాఖ.. క్యాలెండర్‌ను కూడా రూపొందించుకున్నట్లు తెలిపారు. పోలవరం రాష్ట్రానికి వరం, జీవమన్నారు. 72 శాతం పోలవరాన్ని నాడే పూర్తిచేశామని.. అప్పట్లో టీడీపీ ప్రభుత్వమే కొనసాగి ఉంటే పోలవరం 2021-22 నాటికే పూర్తయ్యేదని చెప్పుకొచ్చారు. 2019లో అధికారంలో ఉన్న నాటి ప్రభుత్వం 17 నెలలు పాటు ప్రాజెక్టును గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నాటి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. చివరకు పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను కూడా మళ్లించారని ఆరోపించారు. పోలవరం రీయింబర్స్‌మెంట్ సొమ్ములను కూడా నాటి ప్రభుత్వం దారి మళ్లించిందని మండిపడ్డారు. పోలవరానికి సంబంధించి ఈసీఆర్ఎఫ్ డ్యాం అత్యంత కీలమని.. డ్యాం పనులు 31 శాతం పూర్తయ్యిందని మంత్రి వెల్లడించారు. రైట్, లెఫ్ట్ కనెక్టివిటీని పూర్తిచేయడానికి రాత్రింబవళ్లు పనిచేస్తున్నారని చెప్పారు. పోలవరం నిర్వాసితులకు ఈ రెండేళ్లలోనేరూ. 2250 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రశ్నార్థకమైన ప్రాజెక్టును తిరిగి కాపాడామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు

## కిసాన్ ఘాట్ వద్ద నిరసనకు
# వేలాదిగా రైతుల రాక

**పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా చర్యలు**

**హర్యానా-పంజాబ్ శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత**

**న్యూఢిల్లీ,జూలై21 :** హర్యానా-పంజాబ్ సరిహద్దులోని శంభు బార్డర్ వద్ద హైటెన్షన్ నెలకొంది. మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు పంజాబ్, హర్యానా నుంచి ఢిల్లీ వైపుగా వేలాది మంది రైతులు బయలుదేరారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద నిరసన తెలిపేందుకు అన్నదాతలు వస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా తక్కువ ధరకు, సబ్సిడీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు నిరసనకు దిగుతున్నారు. అయితే, వారిని అడ్డుకునేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద మహాపంచాయత్‌కు 'దేశ్ బచావో మోర్చా' పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా సుమారు 550 రైతు సంఘాలు, సామాజిక సంస్థలు ఇందులో పాల్గొననున్నాయి. అయితే, నేడు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ఢిల్లీకి బయలుదేరుతున్నట్లు ప్రకటించింది. దీంతో శంభు సరిహద్దును పోలీసులు మూసివేశారు. రైతులను అడ్డుకునేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ అన్నదాతలను నిలువరించేందుకు చర్యలు చేపట్టారు. బారికేడ్లు, ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ పంజాబ్ నాయకుడు జర్మన్‌జిత్ సింగ్ బండాలా మాట్లాడారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం భారతీయ రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, విస్తృత ప్రజానీకంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. భారతదేశంలోని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను విస్మరిస్తూ అమెరికన్ కంపెనీలు, రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ఈ ఒప్పందం లక్ష్యమని బండాలా ఆరోపించారు. నేడు పంజాబ్ రైతులతో పాటు హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల నుంచి నిరసనలో పాల్గొనేందుకు అన్నదాతలు వస్తున్నారని తెలిపారు. ఒకవేళ తాము ఢిల్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటే అక్కడే శాంతియుత సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన ఆరంభం మాత్రమేనని, ఒప్పందాన్ని కేంద్రం రద్దు చేయకపోయినా, తమ డిమాండ్లను పరిష్కరించకపోయినా ఆందోళనను తీవ్రతరం చేస్తామని బండాలా హెచ్చరించారు.

## పార్లమెంట్లో ప్రతిపక్ష నేతలకు
# సమాధానం ఇవ్వరా

**కేంద్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డ ఎంపి చామల**

**న్యూఢిల్లీ, జూలై 21 :** పార్లమెంటులో ప్రతిపక్ష నేతలు అడిగిన అంశాలకు కేంద్రం ఎందుకు సమాధానం చెప్పట్లేదని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీజేపీ పార్టీ మద్దతుదారు, కార్యకర్తలను కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా సీజేపీ కార్యకర్తలపై ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్ చేశారని అన్నారు. ఈ ఘటనలో పలువురు సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయని వెల్లడించారు. ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో సీజేపీ కార్యకర్తలను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో కలిసి పరామర్శించినట్లు ఎంపీ చామల చెప్పుకొచ్చారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌తో ఎందుకు రాజీనామా చేయించట్లేదని ఎంపీ చామల నిలదీశారు. ప్రధాని మోదీని మూడోసారి ప్రజలు ఎన్నుకున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను మోదీ పరిష్కరించే దిశగా ఎందుకు ముందుకు పోవట్లేదని నిలదీశారు. రైతులు హరియాణాలో ఆందోళన చేస్తున్నారని, వారిని ఎందుకు అడ్డుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.



## సిజెపి మార్చ్ సందర్భంగా
# లాఠీచార్జి దురదృష్టకరం

**ఈ ఘటనపై ప్రధాని మోడీ మౌనం వీడాలి**

**పార్లమెంటులో అత్యవసరంగా చర్చించాలి: రాహుల్**

**న్యూఢిల్లీ, జూలై 21 :** ఢిల్లీలో సీజేపీ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యను కాంగ్రెస్ అగ్రనాయకుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఖండించారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. పోలీసుల లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగంలో గాయపడిన విద్యార్థులను రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ కలిసి పరామర్శించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య గురించి ప్రధాని మోదీ ఇప్పటివరకు స్పందించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. విద్యార్థులపై జరిగిన ఘటనకు ప్రధాని క్షమాపణ చెప్పాలని, ఇలాంటి చర్యలు వెంటనే ఆగాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఈ ఘటనపై అత్యవసర చర్చ నిర్వహించాలని కోరారు. గాయపడిన విద్యార్థులు చికిత్స పొందుతున్న రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి రాహుల్ గాంధీ, ప్రి యాంకా గాంధీ వెళ్లి వారిని పరామర్శించనున్నారు. విద్యార్థుల గొంతును అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ సహించబోదని రాహుల్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం, పోలీసు చర్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సీజేపీ మార్చ్ సందర్భంగా వేలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో 100 మందికి పైగా పోలీసులు, 60 మందికి పైగా నిరసనకారులు గాయపడినట్లు అధికారులు తెలిపారు.



## హనీమూన్ హత్య కేసు..

**సోనమ్‌కు రెండు ఆప్షన్లు ఇచ్చిన సుప్రీం**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నిందితురాలైన సోనమ్‌కు రెండు ఆప్షన్లు ఇచ్చింది. అవి పోలీసులకు లొంగిపోవడం, లేదా బెయిల్‌ను రద్దు చేయించుకోవడం. హనీమూన్ సమయంలో తన భర్తను హత్య చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో షిల్లాంగ్ న్యాయస్థానం సోనమ్‌కు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ మేఘాలయ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై మంగళవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కేసు విచారణలో భాగంగా కీలకమైన సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసేలోగా సోనమ్ లొంగిపోవాలని ధర్మాసనం సూచించింది. అనంతరం కేసు మెరిట్స్ ఆధారంగా ఆమె బెయిల్‌ను పునఃపరిశీలిస్తామని తెలిపింది. సోనమ్ లొంగిపోవడాన్ని ఎంచుకుంటే.. సాక్షుల విచారణను వేగవంతం చేయాలని, బెయిల్ దరఖాస్తును పునఃపరిశీలించాలని ట్రయల్ కోర్టును ఆదేశిస్తామని పేర్కొంది. 23లోగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. లేదంటే ఇరువర్గాల వాదనలు పరిగణనలోకి తీసుకొని తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

## రెబల్ నేతలను
## మళ్లీ చేర్చుకోను : మమతా బెనర్జీ



**పశ్చిమ బెంగాల్ :** తృణమూల్ కాంగ్రెస్‌లో తిరుగుబాటు నేతలపై మమతా బెనర్జీ మరోసారి విరుచుకుపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లోని కాంగ్రెస్, వామపక్ష పార్టీలు సహా జాతీయ స్థాయిలో విపక్ష కూటమి పార్టీలన్నీ తమ విభేదాలను పక్కనపెట్టి భాజపాకు వ్యతిరేకంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సొంత పార్టీలో తిరుగుబాటుదారులను ప్రస్తావిస్తూ.. ఆ ద్రోహులను ఎప్పటికీ తిరిగి పార్టీలో చేర్చుకోనని స్పష్టం చేశారు. కోల్‌కతాలో టీఎంసీ కాళీఘాట్ విభాగం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన దీదీ.. భాజపా వ్యతిరేక పోరాటం రాజకీయాలకు అతీతమైందన్నారు. "రాష్ట్రంలో భాజపాకు వ్యతిరేకంగా పోరాటంలో విపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని కోరుతున్నా. నాకు ఎలాంటి భేషజాలు లేవు. పార్టీని వీడుతున్న వారికి ఓ విషయం చెబుతున్నా. భాజపాకు మద్దతుగా ఉండాలి అనుకుంటే నేరుగా ఆ పార్టీలో చేరి, ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ చేస్తున్నా. ఎంత ఎక్కువ మంది వెళ్లిపోతే, నాకు అంత సంతోషమే. ఆయా స్థానాలను యువనాయకులతో భర్తీ చేసుకుంటా" అని పేర్కొన్నారు. భాజపా సహాయంతో తిరుగుబాటు నేతలు పార్టీ గుర్తును లాక్కునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని.. అయితే, తానే వ్యవస్థాపక అధ్యక్షురాలిని అయినందుకు దానిని చేజిక్కించుకోవడం వాళ్లకు కుదరదని మమతా బెనర్జీ పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని, తనను అడ్డుకునే శక్తి ఎవరికి ఉందో చూస్తానని అన్నారు.



## కాక్రోచ్ పార్టీ ఆందోళనపై
# కేంద్రం అప్రమత్తం

**విద్యార్థులతో చర్చించేందుకు సిద్ధమని సంకేతాలు**


**లాఠీఛార్జ్‌లో గాయపడ్డ విద్యార్థులను పరామర్శించిన జెపి నడ్డా**

**న్యూఢిల్లీ, జూలై 21 :** నీట్ ప్రశ్నపత్రం లీక్, విద్యా వ్యవస్థలో లోపాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం చేపట్టిన 'చలో పార్లమెంట్' యాత్ర ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో సీజేపీ ఆందోళనకు శాంతియుత పరిష్కారం చూపే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థి ప్రతినిధులతో చర్చలకు సిద్ధమని కేంద్రం ప్రకటించినట్లు సమాచారం. ఈ సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అందుకోసం ఆ దిశగా చర్యలు చేపట్టింది. విద్య మంత్రిత్వ శాఖ లేదా ఉన్నతాధికారుల స్థాయిలో విద్యార్థులతో సమావేశం నిర్వహించే ఆస్కారం ఉందని తెలుస్తోంది. దీంతో నీట్ నిర్వహించే పరీక్షా వ్యవస్థలో పారదర్శకతతో పాటు సంస్కరణల దిశగా ముందడుగు పడనుంది. సోమవారం చలో పార్లమెంట్ యాత్రలో విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని మంగళవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డా పరామర్శించారు. అనంతరం విద్యార్థులతో కేంద్రం చర్చలకు సుముఖంగా ఉందనే ప్రచారం ప్రారంభమైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్, పోటీ పరీక్షల్లో అవకతవకలతో పాటు పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థి లోకం భగ్గుమంది. దీంతో జాతీయ స్థాయిలో విద్యార్థుల నిరసనలు, నిరాహార దీక్షలు ఉధృతమయ్యాయి. దాంతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 'చర్చల కోసం తలుపులు తెరిచే ఉన్నాయని' కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరో వైపు ఈ అంశంపై ప్రధాని మోదీకి విద్యావేత్తలతో పాటు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఒంకోవైపు నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. మంగళవారం న్యూఢిల్లీలో మంగళ్ మిలన్ పేరిట ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ ఘోర పాపమని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు.

# 4 కోట్ల డౌన్‌లోడ్‌లు దాటేసిన ఆధార్ యాప్




ఆధార్ సంబంధిత సేవల కోసం ఎంఆధార్ యాప్ స్థానంలో తీసుకొచ్చిన కొత్త ఆధార్ యాప్ 4 కోట్ల డౌన్‌లోడ్ మార్క్‌ను దాటింది. కొత్త ఆధార్ యాప్ ద్వారా సుమారు 49 లక్షల మొబైల్ నంబర్లు, 11.65 లక్షల చిరునామాలు, 12.5 లక్షల ఇ-మెయిల్స్ అప్‌డేట్ అయ్యాయని కేంద్రం వెల్లడించింది. బయోమెట్రిక్ లాక్/అన్‌లాక్ ఫీచర్‌ను 1.91 కోట్ల సార్లు వినియోగించుకున్నట్లు కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ యాప్‌లో ఫేస్ ఐడీ ఆధార్ వెరిఫికేషన్, బయోమెట్రిక్ లాక్/అన్‌లాక్, మొబైల్ నంబర్, ఇ-మెయిల్ ఐడీ, అడ్రస్ అప్‌డేట్ వంటి సేవలను సులువుగా స్మార్ట్‌ఫోన్ సాయంతో చేసుకోవచ్చు. వినియోగదారుల ఐడెంటీటి, చిరునామాను ఉచితంగా అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని వచ్చే ఏడాది జూన్ 14 వరకు ఉడాయ్ కల్పిస్తోంది. జులై 1 నుంచి ఉచితంగా ఇ-మెయిల్ అప్‌డేట్ సదుపాయాన్ని ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు అందిస్తోంది. హోటల్ చెక్-ఇన్ లేదా ఇతర వెరిఫికేషన్ సమయాల్లో పూర్తి ఆధార్ కార్డు కాపీని ఇవ్వకుండా కేవలం అవసరమైన సమాచారాన్ని డిజిటల్ పద్ధతిలో అందించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.



## బిజినెస్




# రెండో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరగడం, విదేశీ మదుపర్ల విక్రయాలు జరపడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. దీంతో సెన్సెక్స్ 238 పాయింట్లు కోల్పోగా.. సెన్సెక్స్ 50 పాయింట్ల మేర పతనమైంది. సెన్సెక్స్ 238.41 పాయింట్ల నష్టంతో 77,470.11 వద్ద ముగిసింది. నిఫ్టీ 50.80 పాయింట్లు పతనమై 24,187.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్30 సూచీలో బజాజ్‌ఫైనాన్స్, ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఎస్‌బీఐ, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రుపాయి విలువ 96.24 వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.33 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,066 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# అప్పుడు రోహిత్ భాయ్ మాటలను నమ్మలేదు : శాంసన్

భారత్ 2026 టీ20 ప్రపంచ కప్ సాధించడంలో సంజు శాంసన్ ప్రధాన పాత్ర పోషించాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలకమైన సూపర్ 8 మ్యాచ్‌లో.. తర్వాత ఇంగ్లాండ్‌తో సెమీ ఫైనల్, న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. టోర్నమెంట్ ఆరంభంలో తుది జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని, అప్పుడు రోహిత్ శర్మ తనకు ధైర్యం చెప్పి భరోసా కల్పించాడని సంజు పేర్కొన్నాడు. అయితే, మొదట్లో రోహిత్ మాటలను తాను నమ్మలేదని, అందుకు ఇప్పుడు క్షమాపణలు చెబుతున్నానని ఓ ఇంటర్వ్యూలో శాంసన్ అన్నాడు. "నిజం చెప్పాలంటే ఆ సమయంలో రోహిత్ భాయ్ చెప్పిన మాటలను నేను నమ్మలేదు. అందుకు ఇప్పుడు సారీ చెబుతున్నా. ఆయన తన అనుభవంతో మనస్ఫూర్తిగా మాట్లాడి నాలో ధైర్యం నింపే ప్రయత్నం చేశాడు. కానీ, ఆ సమయంలో నేను తీవ్ర నిరాశలో కూరుకుపోయి ఉన్నాను. ఆ తర్వాత రోహిత్ చెప్పిన మాటలను గుర్తు చేసుకుని.. నా ఆలోచన విధానాన్ని మార్చుకున్నాను. తర్వాత అంతా సజావుగా సాగిపోయింది " అని శాంసన్ పేర్కొన్నాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌నకు ముందు న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో శాంసన్ విఫలమయ్యాడు. ఒక్క మ్యాచ్‌లోనూ 30కిపైగా స్కోరు చేయలేదు. అప్పుడు చాలా నిరుత్సాహానికి గురయ్యానని, నాలుగైదు రోజులు చాలా కష్టంగా గడిచాయని శాంసన్ పేర్కొన్నాడు. ఆ క్లిష్ట పరిస్థితి తనను మానసికంగా మరింత బలంగా మార్చిందన్నాడు.


# రో-కోను తప్పిస్తే స్టేడియం పైకప్పు లేచిపోవడం గ్యారంటీ

### మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్

భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను జట్టు నుంచి తప్పించడం చాలా కష్టతరమని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. వారిని బలవంతంగా టీమ్ నుంచి పంపించాలని చూస్తే అభిమానుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డే రోహిత్‌కు చివరి అంతర్జాతీయ మ్యాచ్ అని వార్తలొచ్చిన వేళ అశ్విన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "రోహిత్, కోహ్లీ ఆడాలని కోరుకుంటే వారిని ఎవరూ టచ్ చేయలేరు. అందుకు కారణం వారు నెలకొల్పిన రికార్డులే. రోహిత్ వన్డేల్లో దాదాపు 12,000 పరుగులు చేశాడు. అలాంటి ఆటగాడిని సులభంగా పక్కనపెట్టడం సాధ్యం కాదు. కోహ్లీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తన బ్యాటింగ్‌తో ఇప్పటికే తానెంటో నిరూపించుకున్నాడు. అంతేకాకుండా ఈ ఇద్దరికి భారీ అభిమానగణం ఉంది. వీరిని చూడటానికే స్టేడియానికి అభిమానులు పోటెత్తుతారు. అలాంటి స్టార్ ఆటగాళ్లను జట్టు నుంచి తప్పిస్తే తీవ్రస్థాయిలో వ్యతిరేకత వస్తుంది. ఒకవేళ రో-కోను తప్పిస్తే స్టేడియం పైకప్పు లేచిపోవడం గ్యారంటీ" అని అశ్విన్ హెచ్చరించాడు.

**బౌలర్ల విషయంలోనూ..** బౌలర్ల విషయంలోనూ అశ్విన్ స్పందించాడు. సిరాజ్, షమి, భువనేశ్వర్ వంటి బౌలర్లు జట్టులో లేకపోతే కొంతమంది మాత్రమే ప్రశ్నిస్తారని పేర్కొన్నాడు. స్టార్ బ్యాటర్ల గురించి జరిగినంత చర్చ బౌలర్ల విషయంలో ఉండదన్నాడు. భవిష్యత్తులో బౌలర్ల గురించి కూడా అభిమానులు అదేస్థాయిలో గళమెత్తితే వారిని జట్టు నుంచి తప్పించడం కష్టమవుతుందని, ఇది జరగాలని కోరుకుంటున్నానని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు.






# సైబర్ నేరగాళ్ల 'బాస్ స్కామ్'?

**వ్యక్తులకు లింకులు పంపించడం, మాయ మాటలు చెప్పో.. భయపెట్టో వారి నుంచి అందినకాడికి దోచుకోవడం సైబర్ నేరగాళ్లు చేసే పని. ఇప్పుడు కేటుగాళ్లు కొత్త పంథా ఎంచుకున్నారు. కంపెనీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. బాస్ పేరిట సందేశాలు పంపిస్తూ పెద్ద మొత్తంలో దోచుకుంటున్నారు. ఈ తరహా మోసాల పట్ల వ్యక్తులు, కంపెనీలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ హెచ్చరికలు జారీ చేసింది. ఇంతకీ ఏమిటీ బాస్ స్కామ్? ఎలా మోసగిస్తున్నారు?**

సైబర్ నేరగాళ్లు ఒక సంస్థలోని సీఈవో లేదా ఇతర ఉన్నతోద్యోగుల పేర్లను ఉపయోగించుకుని ఆ సంస్థలో పనిచేసే ఉద్యోగులను మోసం చేసే విధానాన్నే బాస్ స్కామ్ అంటారు. పై అధికారుల ఆదేశాలను సాధారణంగా ఉద్యోగులు తూ.చ. తప్పకుండా పాటిస్తుంటారు. దీన్నే ఆసరగా చేసుకుని కింది స్థాయి ఉద్యోగుల నుంచి డబ్బులు బదిలీ చేయించుకోవడం లేదా రహస్య సమాచారాన్ని తస్కరించడం ఈ స్కామ్ ముఖ్య ఉద్దేశం. తొలుత సీఈవోలు, ఉన్నతాధికారులకు సైబర్ నేరగాళ్లు వల పన్నుతారు. ఆర్‌బీఐ వంటి ప్రభుత్వ నియంత్రణ సంస్థల పేరుతో కంపెనీ సీఈవోలకు వాట్సాప్ లేదా ఇ-మెయిల్ సందేశాలు పంపుతారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ ఒక జిప్ ఫైల్‌ను సెండ్ చేస్తారు. ఆ ఫైల్‌ను సీఈవో ఓపెన్ చేయగానే మాల్‌వేర్ సిస్టమ్‌లోకి ప్రవేశిస్తుంది. చాలా కేసుల్లో సీఈవోలు ఆయా సందేశాలను తమ ఫైనాన్స్ ఆఫీసర్లకు పంపించినట్లు ×4జ పేర్కొంది. ఆ మాల్‌వేర్ ద్వారా సైబర్ నేరగాళ్లు వాట్సప్ వెబ్ సెషన్లను హ్యాక్ చేసి, వారి అఫీషియల్ కమ్యూనికేషన్లను తమ అధీనంలోకి తీసుకుంటారు. ఆ తర్వాత ఆ నంబర్ నుంచి ఫైనాన్స్ టీమ్‌కు మెసేజ్‌లు పంపి, అత్యవసరంగా డబ్బులు బదిలీ చేయాలని ఆదేశిస్తారు.

**జాగ్రత్తపడాలి?**

వాట్సప్ లేదా ఇ-మెయిల్ ద్వారా డబ్బులు పంపాలని లేదా అకౌంట్ వివరాలు మార్చాలని పై అధికారుల నుంచి ఆదేశాలు వస్తే వెంటనే వారికి నేరుగా ఫోన్ చేసి లేదా స్వయంగా కలిసి కనుక్కోవాలి.

తెలియని సోర్సెస్ నుంచి వచ్చే ఫైల్స్ లేదా అటాచ్‌మెంట్లను డౌన్‌లోడ్ చేయకూడదు. ఆర్‌బీఐ వంటి సంస్థలు ఎప్పుడూ వాట్సప్ వంటి మార్గాల ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు పంపించబోవని గుర్తుంచుకోవాలి.

వాట్సప్‌లో మీ ప్రమేయం లేకుండా ఏవైనా ఇతర డివైజెస్ కనెక్ట్ అయి ఉన్నాయేమో ఎప్పటిప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలి. కంప్యూటర్లలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసిన యాంటీ-మాల్‌వేర్ టూల్స్ వాడాలి. అనధికారిక ఫైల్స్‌ను బ్లాక్ చేసేలా విండోస్ సిస్టమ్స్‌లో సెట్టింగ్స్ మార్చుకోవాలి.



# కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపుతారా..?

### మండిపడ్డ క్రిస్ శ్రీకాంత్

లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపడాన్ని మాజీ చీఫ్ సెలక్టర్ క్రిస్ శ్రీకాంత్ తప్పుబట్టారు. అనుభవజ్ఞుడైన రాహుల్‌ని ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ తర్వాత పంపుతారా?అని ప్రశ్నించారు. తరచూ ప్రయోగాలు చేస్తూ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీశారంటూ టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్‌పై ఫైర్ అయ్యారు. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ల్లోనూ సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీ ఓపెనింగ్ జోడీని పదేపదే మార్చారని, ఇలా చేయడం వల్ల జట్టులో స్థిరత్వం లోపిస్తుందని అభిప్రాయపడ్డారు. "అంత భారీ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు ఎవరైనా కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపుతారా? క్లిష్టమైన పరిస్థితుల్లో లక్ష్య ఛేదనలో అతను జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీల విషయంలో మీరు ఎలాగైతే తప్పులు చేశారో ఇప్పుడు కేఎల్ రాహుల్ విషయంలోనూ అలాగే చేస్తున్నారు. రాహుల్ ఆరు లేదా ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడా?ఇది చాలా అన్యాయం. ఒకవేళ రాహుల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఉంటే 2023 ప్రపంచ కప్ మాదిరిగా కోహ్లీకి తోడుగా నిలిచేవాడు. రాహుల్ వేగంగా పరుగులు రాబడతాడు. కానీ, మ్యాచ్ దాదాపు ముగిసిపోయిన తర్వాత అతన్ని బ్యాటింగ్‌కు పంపారు. ఓవర్‌కు 15 పరుగులు అవసరమైనప్పుడు అక్షర్ పటేల్‌తో కలిసి రాహుల్ మ్యాచ్‌ను ఎలా గెలిపించగలడు?" శ్రీకాంత్ ప్రశ్నించారు. ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో భారత్ 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ప్రత్యర్థి జట్టు 388 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. టీమ్‌ఇండియా 7 వికెట్ల నష్టానికి 360 పరుగులు చేసి పోరాడి ఓడింది. రోహిత్ (138), గిల్ (77), కోహ్లీ (74) రాణించినా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఈ మ్యాచ్‌లో ఓటమితో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-2తో కోల్పోయింది.

# కష్టకాలంలో విరాట్ భాయ్ అండగా నిలిచాడు : పి.వి.సింధు




భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు ఇటీవల జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీకి ముందు రెండేళ్లపాటు సింధు కెరీర్ పరంగా చాలా ఇబ్బందులు పడింది. ప్రతి టోర్నీలో బరిలో దిగి ఒకటి, రెండు రౌండ్లలోనే ఇంటిముఖం పట్టింది. గాయాలు కూడా ఇబ్బంది పెట్టాయి. ఈ ఫామ్‌తో 2028 ఒలింపిక్స్ వరకూ కొనసాగుతుందా అన్న సందేహాలు కలుగుతున్న సమయంలో.. తనలో ఛాంపియన్ ఆట ఇంకా ఉందని చాటుతూ ఈ తెలుగమ్మాయి జపాన్ ఓపెన్‌లో చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. తన కెరీర్ కష్ట కాలంలో ఉన్నప్పుడు.. టీమ్‌ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ అండగా ఉన్నట్లు సింధు పేర్కొంది. కోహ్లీ మాటలు తనలో స్ఫూర్తి నింపాయని తెలిపింది. "నేను విరాట్ భాయ్‌కి ఎప్పుడూ రుణపడి ఉంటాను. నా కెరీర్ క్లిష్టమైన దశలో ఉన్నప్పుడు నేను కోహ్లీని సంప్రదించాను. వరుస గాయాలు, ఆశించిన ఫలితాలు రాకపోవడంతో సతమతమవుతున్న సమయంలో నన్ను అర్థం చేసుకునే వ్యక్తి ఒకరు నాకు అవసరమయ్యారు. కోహ్లీ నిమిషాల వ్యవధిలోనే స్పందించారు. మరుసటి రోజే మేము కలుసుకున్నాం. ఆయన ఇచ్చిన సలహాలు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆయన చెప్పిన మాటలు నాకు, నా భర్త దత్తాకూ బాగా గుర్తుండిపోయాయి. కొన్ని సంభాషణలు మన ఆలోచనా తీరునే మార్చేస్తాయి. అటువంటి వాటిలో ఇదొకటి" అని సింధు వివరించింది.

# హాకీ వరల్డ్ కప్.. జట్టును ప్రకటించిన భారత్

ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనున్న పురుషుల హాకీ ప్రపంచ కప్ టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ టోర్నమెంట్ కోసం మంగళవారం 20 మంది సభ్యులతో భారత్ జట్టును ప్రకటించింది. డిఫెండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఇటీవల లండన్ అంచె ప్రొ హాకీ లీగ్‌లో భారత్ 24 మంది ఆటగాళ్లతో బరిలోకి దిగింది. కానీ, ప్రపంచ కప్‌లో జట్టు పరిమాణంపై ఉన్న పరిమితి కారణంగా ఆ లీగ్‌లో పాల్గొన్న నలుగురు ఆటగాళ్లకు జట్టులో చోటు దక్కలేదు. డిఫెండర్ అమన్‌దీప్ లక్రా, మిడ్‌ఫీల్డర్లు రాజ్ కుమార్ పాల్, రబిచంద్ర సింగ్ మొయిరాంగ్‌థెమ్, ఫార్వర్డ్ సెల్వం కార్తీ చోటు కోల్పోయారు. ప్రపంచ కప్‌లో పూల్ డిలో ఉన్న భారత్ ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్‌తో, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. చివరగా 2023లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో భారత్ ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాక్‌ను ఓడించి విజేతగా అవతరించింది. తర్వాత ఒక్క పతకం కూడా సాధించలేదు. 1971లో కాంస్యం, 1973లో రజతం సాధించింది.



**భారత జట్టు: గోల్ కీపర్లు:** మోహిత్ హెచ్ఎస్, సూరజ్ కర్కెరా. డిఫెండర్లు: జర్మన్‌ప్రీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), అమిత్ రోహిదాస్, జుగ్రాజ్ సింగ్, సంజయ్, సుమిత్, యశ్‌దీప్ సివాచ్. మిడ్‌ఫీల్డర్లు: రాజిందర్ సింగ్, ఆదిత్య అర్జున్ లాలాగే, హార్దిక్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, నీలకంఠ శర్మ, వివేక్ సాగర్ ప్రసాద్. ఫార్వర్డ్లు: దిల్‌ప్రీత్ సింగ్, శిలానంద్ లక్రా, సుఖ్‌జీత్ సింగ్, మన్‌దీప్ సింగ్, అభిషేక్.




# పెరిగిన యూపీఐ లావాదేవీల విలువ

యూపీఐ లావాదేవీలు గత అయిదేళ్లలో భారీగా విస్తరించాయి. లావాదేవీల సంఖ్య పరంగా 425%, విలువలో 273% మేర వృద్ధి నమోదైంది. సోమవారం లోక్‌సభకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌధరి ఈ సమాచారాన్ని అందించారు. 2026 జూన్ నాటికి యూపీఐ వినియోగదారుల సంఖ్య 55.49 కోట్లకు చేరింది. యూపీఐ చెల్లింపులను భద్రంగా, సురక్షితంగా మార్చేందుకు ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) నిరంతరం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 10 దేశాలు 12 భాగస్వామ్య సంస్థలతో కలిసి యూపీఐని ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భూటాన్, సింగపుర్, యూఏఈ, ఫ్రాన్స్ మారిషస్, శ్రీలంక, నేపాల్, ఖతార్, గ్రీస్, కాంబోడియా ఉన్నాయని చెప్పారు.

జనం వార్త







## ఎన్టీఆర్,త్రివిక్రమ్ గాడ్ ఆఫ్ వార్ హీరోయిన్‌గా కియారాపై చర్చ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో 'గాడ్ ఆఫ్ వార్' ఒకటి. స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు హీరోయిన్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రం పురాణ గాథల స్ఫూర్తితో రూపొందనున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా అని వార్తలు వస్తుండగా.. ఎన్టీఆర్ ఇందులో శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నట్లు టాక్. కథలో కీలకమైన మహిళా పాత్రకు కియారా సరిపోతారని మేకర్స్ భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్టీఆర్, కియారా అద్వానీ ఇప్పటికే 'వార్ 2' చిత్రంలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమాలో వారి మధ్య పూర్తి స్థాయి జోడీ కనిపించలేదు. కియారా నటించిన 'భరత్ అనే నేను' ఘన విజయం సాధించగా, రామ్ చరణ్‌తో చేసిన 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. దీంతో కొందరు అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో సెంటిమెంట్‌గా చర్చిస్తున్నారు. నటుడు సిద్దార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న తర్వాత కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే త్రివిక్రమ్ దర్శకత్వంలోని 'గాడ్ ఆఫ్ వార్' సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం.

## అప్పుడు నన్ను అన్‌లక్కీ అన్నారు : భాగ్యశ్రీ

ప్రస్తుతం 'లెనిన్' విజయాన్ని ఆస్వాదిస్తున్నారు నటి భాగ్యశ్రీ. ఈ విజయం తనకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. " చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి విజయం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నాను. నేను పడిన కష్టానికి ఫలితమే ఇది. 'లెనిన్' విజయంతో నాలో ఆసక్తి, ఉత్సాహం రెట్టింపయ్యాయి. ఇప్పుడు నాకు ఒక్క రోజు కూడా వృథా చేయకూడదనిపిస్తోంది. సక్సెస్‌తో వచ్చే ఆ చిన్న ప్రేరణ అందరికీ అవసరం. నా కుటుంబానికి నేను ఎప్పుడూ స్టార్‌నే.

చిత్రపరిశ్రమలో పెద్ద పెద్ద నటులతో కలిసి నటించడం చూసి వాళ్లు సంతోషపడ్డారు. మేము థియేటర్లలో స్టార్‌లను చూసి పెరిగిన ప్రపంచం నుంచి వచ్చాం. వాళ్లతోపాటు నేనూ నటిస్తానని ఎప్పుడూ ఊహించలేదు. బాక్సాఫీస్ కలెక్షన్లు, కమర్షియల్ సక్సెస్ గురించి నా తల్లిదండ్రులు ఎప్పుడూ పట్టించుకోలేదు. వాళ్లకి నేను స్క్రీన్‌మీద కనపడడమే గొప్ప విషయం. కొన్ని సినిమాలు ఆడకపోవడంతో నన్ను కొందరు అన్‌లక్కీ అన్నారు. ఆ మాటలు బాధించలేదు. ఆశ్చర్యానికి గురి చేశాయి. ఇండస్ట్రీలో తాప్సీ పన్ను, శృతి హాసన్, శ్రీలీల లాంటి నటీమణులు కూడా తమ కెరీర్‌లో ఇలాంటివి ఎదుర్కొన్నారని తర్వాత అర్థమైంది. సినిమా విజయం సాధించకపోతే ఒక్కరినే బాధ్యుల్ని చేయడం సరికాదు. అది టీం వర్క్. ప్రతి ఒక్కరి కృషి దాంట్లో ఉంటుంది " అని ఆమె పేర్కొన్నారు. రవితేజ 'మిస్టర్ బచ్చన్'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన భాగ్యశ్రీ.. ఆ తర్వాత 'కింగ్‌డమ్', 'ఆంధ్ర కింగ్ తాలూకా'లో నటించారు. తమిళంలో 'కాంత' సినిమాతో ప్రశంసలు అందుకున్నారు.





## రామ్‌చరణ్‌తో సుకుమార్ మూవీ

### హీరోయిన్‌గా రష్మిక అంటూ ప్రచారం


క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం సినిమా స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధమైనట్లు తెలుస్తుండగా, ఇప్పుడు హీరోయిన్ ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే సుకుమార్ కెరీర్‌ను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుంది. 'ఆర్య' నుంచి 'పుష్ప 2' వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమాలో కొత్త హీరోయిన్‌కే అవకాశం ఇచ్చారు. ఒకసారి నటించిన కథానాయికను వెంటనే మరో సినిమాలో రిపీట్ చేయలేదు. ఇదే ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. అయితే ఈసారి రామ్ చరణ్ సినిమా కోసం ఆ సెంటిమెంట్‌ను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురు నటీమణుల పేర్లు పరిశీలించినప్పటికీ, రష్మిక మందన్న పేరు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు సుకుమార్‌తో 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాల్లో రష్మిక సక్సెస్‌ఫుల్‌గా పనిచేయడంతో, మరోసారి ఆమెనే ఎంపిక చేయాలనే అభిప్రాయం టీమ్‌లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. రామ్ చరణ్, రష్మిక మందన్న ఇప్పటివరకు ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు. ఈ ఫ్రెష్ పెయిర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం భావిస్తోందట. అంతేకాకుండా ప్రస్తుతం రష్మిక పాన్ ఇండియా స్థాయిలో వరుస విజయాలతో దూసుకుపోతుండటం కూడా నిర్మాతలకు అదనపు బలంగా మారింది. ఆమె క్రేజ్ సినిమాకు అన్ని భాషల్లో మంచి బిజినెస్‌కు దోహదపడుతుందనే అంచనాలు ఉన్నాయి. ఒకవేళ రష్మికనే హీరోయిన్‌గా ఖరారు చేస్తే, సుకుమార్ తన కెరీర్‌లో తొలిసారి ఒకే హీరోయిన్‌ను వరుసగా రెండు చిత్రాల్లో తీసుకున్న దర్శకుడిగా నిలుస్తారు. అయితే ప్రస్తుతం ఇవన్నీ ప్రచారంలో ఉన్న వార్తలే. చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే హీరోయిన్ ఎంపికపై పూర్తి స్పష్టత రానుంది.



## పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార

తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆథవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు.సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్ర్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెళిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.






## షూటింగ్‌లో గాయపడ్డ బాలయ్య

నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తుండగా, ఈ చిత్ర షూటింగ్ తాజాగా కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతుంది. అయితే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసరాలలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా, ఆయన అనుకోకుండా కాలు జారి కిందపడిపోయారు. దాంతో ఆయన మోకాలిక స్వల్ప గాయం అయింది. వెంటనే చిత్ర బృందం షూటింగ్ ఆపేసి బాలయ్యని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం ఇతర పరీక్షలు కూడా నిర్వహించారు. స్వల్ప గాయమే అయిందని, కంగారు పడాల్సిన పనిలేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే కొన్ని రోజుల పాటు బాలయ్య విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు సమాచారం. ఇక సినిమాల విషయానికి వస్తే.. గోపిచంద్ మలినేనితో పాటు కొరటాల దర్శకత్వంలోను బాలయ్య ఓ చిత్రం చేస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువసుధ ఆర్ట్స్, ఎస్ఎల్‌వీ సినిమాస్ సంస్థలు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలకృష్ణ ఈ సినిమాలో గత చిత్రాలకు భిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని, మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో కూడిన మాస్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



## నేనెప్పుడూ అలాంటి రోల్స్ చేయలేదు

### కాజల్ అగర్వాల్

ప్రాధాన్యత లేని పాత్రలు ఎందుకు చేయాలంటున్నారు కథానాయిక కాజల్ అగర్వాల్. ప్రాధాన్యత ఉన్న సినిమాలు చేయడమే తనకిష్టమని స్పష్టం చేశారు. జాన్వీ కపూర్ 'పెద్ది' సినిమాలోని పాత్ర చిత్రీకరణపై ఇటీవల చర్చ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాజల్ స్పందించారు. "గతంతో పోలిస్తే ఇప్పుడు దక్షిణాదిలో హీరోయిన్ పాత్రల్లో ఎంతో మార్పు వచ్చింది. సినిమాల్లో స్త్రీలను వస్తువుగా చూపించే సన్నివేశాల విషయంలో నేనెప్పుడూ గీత గీసుకుంటాను. ఇప్పటివరకూ అలాంటి పాత్రలు చేయలేదు. బాలీవుడ్‌తో పోలిస్తే నాకు సౌత్‌లో ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎక్కువగా వచ్చాయి. హిందీలో పెద్ద పెద్ద హీరోలతో నటించినా.. అంత గుర్తింపు రాలేదు. అందుకే సౌత్ సినిమాల వైపు వచ్చాను. నాకు కావాల్సింది ప్రాధాన్యత ఉన్న పాత్రలు. దక్షిణాదిలో అలాంటివి సమృద్ధిగా వచ్చాయి. అలాంటప్పుడు నేను బాలీవుడ్‌లో సగటు పాత్రలు ఎందుకు చేయాలి? భాష నాకు ఎప్పుడూ అడ్డు రాలేదు. బాలీవుడ్ చిత్రపరిశ్రమలో ఏదీ సమయానికి జరగదు. నాకు సమయపాలన ఎక్కువ. గతంలో ఒకసారి నేను సల్మాన్ ఖాన్ కోసం చాలాసేపు ఎదురుచూశాను. ఆయన సాయంత్రం వచ్చారు. సౌత్ సినిమాల్లో నటించినప్పుడు నాకు క్రమశిక్షణ బాగా అలవాటైంది" అని కాజల్ పేర్కొన్నారు.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083..EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com